

## అక్రమ మైనింగ్‌పై పోలీసుల ఉక్కుపాదం

- - మెరుపు దాడుల్లో జేసీబీల, ట్రాక్టర్ల స్వాధీనం

**నిజామాబాద్ జిల్లా, జూన్ 01(డీడీ9 వార్త) :**

జిల్లాలో అక్రమ మొరం మరియు ఇసుక తవ్వకాలపై నిజామాబాద్ పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ ఇన్‌చార్జ్ శ్రీ మస్తాన్ అలీ పర్యవేక్షణలో 'చీతా ఫోర్స్' బృందం సోమవారం ప్రత్యేక దాడులు నిర్వహించి భారీగా వాహనాలను స్వాధీనం చేసుకుంది.

**కమ్మర్‌పల్లిలో మొరం తవ్వకాలపై దాడి**

కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బషీరాబాద్ గ్రామ శివారులో గల కాడి చెరువు వద్ద అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో చీతా ఫోర్స్ సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అక్కడ అక్రమంగా మొరం తరలిస్తున్న ఒక జేసీబీ మరియు ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, తదుపరి చర్యల కోసం కమ్మర్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

**ఎరుగట్లలో ఇసుక మాఫియాపై చర్య**

అదేవిధంగా ఎరుగట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తడపాకల పెద్దవాగు ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించి, చీతా ఫోర్స్ బృందం మెరుపు దాడి నిర్వహించింది. ఈ తనిఖీల్లో ఒక జేసీబీ మరియు నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఎరుగట్ల పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ సహజ వనరులను అక్రమంగా దోచుకుంటూ పర్యావరణానికి భంగం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు నిజామాబాద్ కమిషనరేట్ ప్రత్యేక నిఘా కొనసాగిస్తుందని, ప్రజలు తమ ప్రాంతాల్లో ఇటువంటి అక్రమ కార్యకలాపాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ జిల్లా, జూన్ 01(డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య సోమవారం విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంతో పాటు అమరవీరుల స్థూపం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. వేదిక నిర్మాణం, అతిథుల వసతి, పార్కింగ్, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ మరియు తాగునీటి సదుపాయాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించే కార్యక్రమం గౌరవప్రదంగా సాగాలని, స్థూపం పరిసరాల్లో పరిశుభ్రతకు, పటిష్ట భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ సమన్వయంతో పనిచేస్తోందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, టౌన్ 4 ఎస్.హెచ్.ఓ సతీష్, నార్త్ తహసిల్దార్ అనిల్ గిరిధర్ తదితరలు పాల్గొన్నారు.



## కమ్మర్‌పల్లిలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

**నిజామాబాద్ జిల్లా, జూన్ 01(డీడీ9 వార్త) :**

గ్రామంలో పరిశుభ్రతను కాపాడటమే లక్ష్యంగా కమ్మర్‌పల్లిలో మురికి కాలువల పూడికతీత, శుభ్రం చేసే పనులను సోమవారం చేపట్టారు. సర్పంచ్ కొత్తపల్లి హారిక, ఉపసర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని మురికి కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాబోయే వానాకాలం దృష్ట్యా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు కాలువలను శుభ్రంగా ఉంచుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. కాలువల్లో ప్రజలు చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయకూడదని వారు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణమే కాకుండా ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాన్ని ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.







# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- లబ్ధిదారులకు జూన్ నెలాఖరు నాటికి ఇళ్లు అందేలా చర్యలు: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

**బాన్సువాడ, మే 01(డిడి9 వార్త):**

బాన్సువాడ పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీతో పాటు బీర్కూర్ మండలంలోని రైతునగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మరియు రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు సోమవారం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, బాన్సువాడ పట్టణం మరియు బీర్కూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి జూన్ నెలాఖరు నాటికి అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పనులు నెమ్మదిగా సాగుతున్న ప్రాంతాల్లో లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని, అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు.నిర్మాణ పనుల్లో నాణ్యతకు ఎలాంటి లోపం లేకుండా కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని, బిల్లుల చెల్లింపుల విషయంలో ప్రతి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులు వెంటనే గృహప్రవేశాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఇప్పటికే ఇళ్లు మంజూరై కూడా వివిధ కారణాల వల్ల నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులను సంప్రదించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.





## మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మండిపాటు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 01(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై, నేత మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ మాట్లాడుతూ... మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై మోహన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు ఎమ్మెల్యే హోదాలో వారిని ఆదుకోవడానికి ప్రశాంత్ రెడ్డి ప్రయత్నిస్తే తప్పేముందని ప్రశ్నించారు. ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు రైతులకు భరోసా ఇవ్వని వేళ, మోర్తాడ్‌లో ప్రశాంత్ రెడ్డి చేపట్టిన ధర్నా వల్లే కలెక్టర్ స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశారని గుర్తు చేశారు. ధర్నా చేస్తేనే ప్రభుత్వం దిగివచ్చిందని, ఇది రైతుల విజయం అని ఆయన పేర్కొన్నారు. అనంతరం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పిస్తూ, ఒకప్పుడు గడప తీసేస్తాం, తోలు తీస్తామన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు రైతుల గడపల వద్దకు ఎందుకు వెళ్లడం లేదని నిలదీశారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. యూరియా యాప్‌ను తొలగించి, పాత పద్ధతిలోనే ఎరువులను అందజేయాలని డిమాండ్ చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధిని పక్కనపెట్టి రాజకీయాలు చేస్తున్న మోహన్ రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.




## భీంగల్‌లో ఉత్తమ మాదిగ విద్యార్థులకు ఘన సన్మానం


**నిజామాబాద్ జిల్లా, జూన్ 01(డీడీ9 వార్త) :**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలని, చదువుతోనే ఏదైనా సాధించడం సాధ్యమవుతుందని వక్తలు పిలుపునిచ్చారు. భీంగల్ మండల కేంద్రంలో 'మాదిగ ఐక్యవేదిక కమిటీ' ఆధ్వర్యంలో భీంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 150 మంది ప్రతిభావంతులైన మాదిగ విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ సూర్జిల్ బాబు, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ పోచన్నలు విద్యార్థులకు మెమంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రయాణించాలని సూచించారు. సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే కష్టపడి చదువుకోవడమే ఏకైక మార్గమని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షుడు గడలా ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ సంటి లతా జై జై నర్సన్న, చెప్పాలా గణేష్, చెంగల్ సర్పంచ్ రాజు, జి. రాజేశ్వర్, టి. అశోక్, దశరథ్, చౌదరి, యోనా, రతన్ రాజేందర్, సాయిబాబా, ముత్యన్న, సుదర్శన్, మాదిగ సంఘాల పెద్దలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హసాకొత్తూరులో ఘనంగా సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 01(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూరు గ్రామంలో సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, ఎంఆర్ఓ (స్పెషల్ ఆఫీసర్) నరేష్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భువనగిరి భాస్కర్ హాజరయ్యారు. లబ్ధిదారులకు ఇండ్ల తాళం చెవులను అందజేసి, వారిని కొత్త ఇండ్లలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నల్లగంటి నర్సయ్య, ఉపసర్పంచ్ ఏనుగు మనోహర్, వార్డు సభ్యులు కుందేటి శ్రీనివాస్, గంగాధర్, కనుక నర్సయ్య, కల్లెడ రాణి, కల్లెడ కాశావ్వ, పసుల గంగు పాల్గొన్నారు. అలాగే ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోపిడి లింగారెడ్డి, మోదిని శ్రీధర్, కల్లెడ లలిత, మంద భాగ్యలక్ష్మి, సీసీ అలేఖ్య, కాంగ్రెస్ నాయకులు ఏలేటి గంగాధర్, మండపల్లి మహేందర్, మహిళా సంఘం సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. కొత్త ఇంట్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.



## బాబాపూర్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 01(డీడీ9 వార్త) :**

భీంగల్ మండలం బాబాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎం.ఏ. సమీర్, ఉపసర్పంచ్ మంద గోవర్ధన్ హాజరై లబ్ధిదారులకు గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు షబ్బీర్ తదితరులు మాట్లాడుతూ, తమ సొంతింటి కలను నిజం చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. తమకు అండగా నిలిచిన బాల్కొండ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



